జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
మంగళవారం 13, మే 2025
www.prajajyothinews.com



### ఎరుకల నాంచారమ్మ దివ్య ఆశీస్సులతో
# ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
ఘనంగా ఎరుకల నాంచారమ్మ కళ్యాణం





### బుద్ధవనాన్ని సందర్శించిన 22 ఆసియా దేశాల
# సుందరీమణుల పోటీదారుల బృందం

నాగార్జున సాగర్ తీరం అందాల అంచున, బుద్ధవనం మహాస్థూపం వద్ద ఫోటోలు దిగిన సుందరీమణులు
బుద్ధుని మహా పాదాలకు పూలతో పూజలు, మహా స్థూపంలో జ్యోతి ప్రజ్వలన, ధ్యానంలో పాల్గొన్న సుందరీమణులు
ప్రపంచ సుందరీమణుల పోటీదారులకు ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్ పి శరత్ చంద్ర పవార్
హాజరైన ఎం ఎల్ ఏ లు కుందూరు జయవీర్ రెడ్డి, బాలు నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఎం ఎల్ సి శంకర్ నాయక్



నల్గొండ మే 12(ప్రజాజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది సుందరీమణుల బృందం సోమవారం నల్గొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది. ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్ లో ఫోటోలు దిగారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి

# అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ కే సాధ్యం...!

- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్
- 9 కోట్ల రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన



దామరచర్ల, మే 12,( ప్రజాజ్యోతి ):రాష్ట్రం లో అభివృద్ధి, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బి ఎల్ ఆర్ ), ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు. సోమవారం మండలం లోని దిలావర్ పూర్ లో 9కోట్ల నిధులతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టూ అనేక గిరిజన తండాలో ఉన్న దిలావర్ పూర్ గ్రామానికి సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతుండేవారని, సరైన రోడ్డు ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించలేదని అన్నారు.

# నాడు చెరువు మట్టి డంపింగ్ .. నేడు ఇటుక బట్టీలకు షిఫ్టింగ్

వేలల్లో మట్టి ట్రిప్పులు - లక్షల్లో నోట్ల కట్టలు
భారీ వాహనాలతో రాత్రి పగలు మట్టి తరలింపు
మండల కేంద్రం నుండి పోతున్నా పట్టించుకోని అధికారులు




# తుర్కకాశ కార్మికుల సమస్యలు కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



## చిన్నతనంలోనే విశాల దృక్పథం సైనికులకు లక్ష ఆర్థిక సహాయం



**భువనగిరి,కలెక్టరేట్ యాదాద్రి మే 12(ప్రజాజ్యోతి)** ఇటీవల ఇండియా, పాకిస్తాన్ల మధ్య యుద్ధం జరుగుతుం డడంతో,భారత సైన్యానికి తన వంతు కర్తవ్యం గా లక్ష రూపాయల విరాళాన్ని తన తల్లి (ప్రభుత్వ విప్ శాసనసభ్యులు,బీర్ల ఐలయ్య సతీమణి )అనితతోకుమారుడు శివమణి,వెళ్లి స్వయంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు కు అందజేశారు. సోమవారం కలెక్టరేట్ కు విచ్చేసి తాను దాచుకున్న సొమ్మును మాత్రమే,తనవంతు కర్తవ్యం గా సైనికులకు విరాళంగా జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,చిన్నతనంలోనే ఇంతటి ఔదార్యాన్ని కన బరిచిన శివమణి భవి ష్యత్తులో,మరింత ప్రయోజ కుడు కావాలని,ఎన్నో సమాజ హితం కోరే కార్యక్రమాలు చేపట్టాలని తాను మనస్ఫూ ర్తిగా ఆకాంక్షి స్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా శివమణి తో శివమణి మాతృ మూర్తి అయిన ఆలేరు శాసన సభ్యులు,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణిని కలెక్టర్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఘనంగా శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణోత్సవ వేడుక



**హుజూర్ నగర్ మే 12 (ప్రజా జ్యోతి)**కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిట కొంగు బంగారమైన శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకను సోమవారం కన్నుల పండుగగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధి దద్దనాల చెరువులో ఆతుకూరి వెంకటప్పయ్య పొలములో వెలసి ఉన్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ వేడుకను మేళతాళాలతో డప్పుల మోతలతో ఘనంగా నిర్వహించినట్లు పురోహితులు ఆతుకూరి సందీప్, గోపి తెలిపారు. మొక్కితే వరాలిచ్చే గోపయ్య సమేత తిరుపతమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ వేడుకకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ వేడుకను భక్తులకు అమ్మవారి అనుగ్రహం లభించే ఒక గొప్ప అవకాశంగా భావిస్తారు. సుమారు 1000 మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చావా ప్రసాద్, జక్కుల శంబయ్య, దండు ప్రసాద్, జక్కుల లింగయ్య, రాజమల్లు, తండు శీను, ఆతుకూరి మల్లయ్య, ఆతుకూరి వెంకటేష్, పాల్గొన్నారు.

## గురుకులం ఇంటర్ ప్రవేశాల కొరకు ఈనెల 15న కౌన్సిలింగ్

**-ప్రిన్సిపాల్ కె. లక్ష్మయ్య**



**దామరచర్ల, మే 12,( ప్రజాజ్యోతి ):** దామచర్ల మండల కేంద్రంలోని తెల ంగ ాణ గిరిజన గురుకుల బాలుర కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లో ప్రవేశాల కొరకు ఈనెల 15న కౌన్సిలింగ్ నిర్వహిం చబడుతు న్నట్లు ప్రిన్సిపల్ కె లక్ష్మయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలోని ఎం ఇ సి, సి ఈ సి గ్రూపులలో చేరాలనుకునే విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో అవంతిపురం గురుకుల ప్రతిభ కళాశాలలో ఈనెల 15న ఉదయం 11:00 గంటలకు జరిగే కౌన్సిలింగ్ కు హాజరుకావాలని కోరారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కార్మికుల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**- సిఐటియూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు**



**అడ్డగూడూర్ మే 12 (ప్రజా జ్యోతి)** అడ్డగుడూర్ మండల కేంద్రంలో సిఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశం సిఐటీయూ మండల నాయకులు బుర్రు అనిల్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పండు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఈనెల 20వ తారీకున దేశవ్యాప్తంగా జరిగే సార్వతీక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా,వ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను, అదేవిధంగా కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన 5% ఉన్న పెట్టుబడిదారుల వద్ద 70% ఆదాయం పోగుపడగా, 50% ప్రజల వద్ద కేవలం 3% మాత్రమే హుండీ రోజు గడవడమే కష్టంగా మారింది. పేదరికం 17% శాతానికి పెరిగింది పెరిగిన, ద్రవ్యోల్బణం,నిత్యవసర సరుకుల ధరలు, కార్మిక పేద ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. అదే విధంగా ఏపీఎస్ పిఎఫ్ పిడిఐఎస్లకు యాజమాన్యాలు సకాలంలో చెల్లించకపోతే గతంలో ఉన్న 25% పిన్నెల్లి వడ్డీని ఒక్క శాతం తగ్గించి యాజమాన్లను మరింత డిఫాల్ట్ గా మారుస్తున్నారు. ఈపీఎఫ్ఓ తెలంగాణ రీజినల్ లో 28 వేల కోట్లు ప్రభుత్వ విద్యా వైద్యం గ్రామీణ ఉపాధి హామీ ఐసిడిఎస్ పథకాలకు వార్షిక బడ్జెట్లలో కోత పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి అనేక కార్మిక సమస్యల పైన జరిగేటువంటి సమ్మెనే విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ ఎంప్లాస్ మండల అధ్యక్షులు బాలెంల మల్లయ్య,ఆటో కార్మికులు బాలెంల పరిశురామలు,డప్పు యాదగిరి, పసల ఆరోగ్యం,తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన... భూ భారతి రెవెన్యూ సదస్సులు

**- భూ సమస్యల శాశ్వత పరిష్కారమే భూ భారతి**

**- ఆర్డీవో పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సులు**

**జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద గరిడేపల్లి మండలం ఎంపిక**






**గరిడేపల్లి,మే 12 (ప్రజా జ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టం అమలులోకి తీసుకువచ్చింది. మే 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకి ఒక మండలాన్ని ఎంపిక చేసింది. సూర్యాపేట జిల్లాలో గరిడేపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయటం జరిగింది. మండలంలో పదకొండు రెవెన్యూ గ్రామాలు ఉండగా జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ రెండు టీంలుగా విభజించి మే 5 నుండి 12 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆర్డీవో వి. శ్రీనివాసులు పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. టీం 1గా తహశీల్దార్ బండ కవిత కి ఆరు రెవెన్యూ గ్రామాలు,టీం 2 గా డిఎటీ యన్. రాజేందర్ రెడ్డి కి ఐదు రెవెన్యూ గ్రామాలు కేటాయించారు. మండల వ్యాప్తంగా రైతుల నుండి 1690 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. భూ భారతి పై రైతుల నుండి విశేష స్పందన వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన ఆర్డీవో శ్రీనివాసులుమొత్తం అప్లికేషన్లను పరిశీలించిన అధికారులు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభించి దశలవారీగా సమస్యలను పరిష్కరించనున్నారు. మండలంలో అత్యధికంగా సాదా బైన,మిస్సింగ్ సర్వేనెంబర్ పట్టా మార్పిడి దరఖాస్తు వచ్చినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు.

**జూన్ 1లోపు భూ సమస్యలకు పరిష్కారం ఎమ్మార్వో బండ కవిత**

గరిడేపల్లి మండలంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్న క్రమంలో మండల వ్యాప్తంగా 1690 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. దరఖాస్తుల పరిశీలన కొరకు మండల వ్యాప్తంగా ఐదు టీంలుగా ఏర్పాటు చేసి ఫీల్డ్ విజిట్ జరుగుతుంది. ఫీల్డ్ విజిట్ పూర్తయిన అనంతరం కలెక్టర్,ఆర్డీవోల పర్యవేక్షణలో జూన్ 1లోపు వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తాం.

**రెవెన్యూ గ్రామాల వారీగా దరఖాస్తులు**

తాళ్ళ మల్కాపురం –73, రాయినిగూడెం–140,కాల్వపల్లి–50,గడ్డిపల్లి –61,గరిడేపల్లి –193,కుతుబ్ షాపురం –140, గానుగబండ–69,వెలిదండ– 269,సర్వారం–118,పొనుగోడు –321,కల్మల్ చెర్వు–256

దరఖాస్తులు రాగా అత్యధికంగా పొనుగోడు వెలిదండ గ్రామాలలో వచ్చాయి. మిస్సింగ్ సర్వే నెం –731,పెండింగ్ మోటేషన్– 26, డిజిటల్ సంతకం–6,విస్తీర్ణం –73,పేరు కరెక్షన్– 7,ప్రివిటేడ్ ల్యాండ్– 46,అసైన్ మెంట్ ల్యాండ్–196,పౌతి– 69, ఇతరతలు–536 దరఖాస్తులు వచ్చాయి.

**హెల్ప్ డెస్క్**

ప్రతి భూభారతి రెవెన్యూ సదస్సులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. రైతు హెల్ప్ డెస్క్ వద్దకు వచ్చి దరఖాస్తు ఫారం తీసుకొని సమస్యల తెలపగా రెవిన్యూ సిబ్బంది దరఖాస్తు ఫారం నింపారు. ఆ దరఖాస్తు ఫారంను ప్రత్యేక కౌంటర్ వద్ద ఇవ్వగా అక్కడ ఉన్న సిబ్బంది దరఖాస్తులు ఏమైనా తప్పులు ఉంటే సరిచేసి తహశీల్దార్ కి అందించగా సంతకం పెట్టి దరఖాస్తుదారునికి అందించరు. ఏ రోజు వచ్చిన దరఖాస్తుల ఆరోజే కంప్యూటర్ ఆపరేటర్ సిసిఎల్ఏ ద్వారా భూ భారతి పోర్టల్ లో అప్లోడ్ చేశారు. ఈ రెవెన్యూ సదస్సులలో డీఏవో ఎన్. రాజేందర్ రెడ్డి,తహశీల్దార్ బండ కవిత, యంఆర్ఐ ప్రవీణ్,ఏఆర్ఐ రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ జాన్ ఖాన్,మణి,అవినాష్,రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైశాఖ మాసం మూడోవ సోమవారం



**సూర్యాపేట టౌన్,మే 12(ప్రజాజ్యోతి):**పవిత్రమైన వైశాఖ మాసం లో స్థానిక విశ్వనాథ స్వామి ఉదయం 6 గంటల నుండి స్వామి వారికి,అభిషేకము అష్టోత్తర హారతి పూజలు మధ్యాహ్నం గంటల వరకు నిర్వహించబడును కార్యనిర్వాహక అధికారి యం పి లక్ష్మణరావు,ప్రధాన అర్చకులు వలివేటి వీరభద్ర శర్మ తెలిపారు. సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు శంభో శంకర మహాదేవా అంటూ అభిషేకం పూజలో పాల్గొన్నారు. ఆలయానికి ప్రతి రోజు భక్తులు వచ్చి పూజలలో పాల్గొన్నారని ప్రధాన అర్చకులు వలివేటి వీరభద్ర శర్మ అన్నారు. అతిపురాతనమైన,మహిమాన్వితమైన శివాలయ దర్శనంతో భక్త కోటికి సర్వం శుభం లాభం కలుగుతుందని,మహా ఆశీస్సులు లభిస్తాయి అభిషేకాల అనంతరం స్వామి వారికి పూలమాలలతో అలంకరణ చేశారు. ఈ పూజలో ఆలయ సహాయ అర్చకులు సాగర శర్మ పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ కే సాధ్యం...!

**- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్**

**- 9కోట్ల రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన**





**దామరచర్ల, మే 12,( ప్రజాజ్యోతి ):**రాష్ట్రం లో అభివృద్ధి, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బి ఎల్ ఆర్ ), ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు. సోమవారం మండలం లోని దిలావర్ పూర్ లో 9కోట్ల నిధులతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టూ అనేక గిరిజన తండాలో ఉన్న దిలావర్ పూర్ గ్రామానికి సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతుండేవారని, సరైన రోడ్డు ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించలేదని అన్నారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విన్నవించగానే దిలావర్పూర్ నుండి వయా మిట్టగూడెం మీదుగా కొత్తగూడెం సమీపంలోని అద్దంకి నార్కట్ పల్లి హైవే వరకు రెండు లైన్ల బిటి రోడ్డు నిర్మించేందుకు 9 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే దిలావర్ పూర్ తో పాటు చుట్టుపక్కల దాదాపు పది తండాల ప్రజల రవాణా సౌకర్యానికి మేలు జరుగుతుందని అన్నారు. దిలావర్పూర్ తాజా మాజీ ఎంపీటీసీ బెజ్జం సైదులు ( సాయి ) మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు బీటీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. వీటితోపాటు మిర్యాలగూడ నుండి ఇందిరమ్మ కాలనీ చింతపల్లి మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి 11 కోట్లు, టీకే తండా గొనియా తండా, కొత్తపేట, కేజేఆర్ కాలనీ, కేతవ తండాల మీదుగా 15 కోట్లతో డబల్ రోడ్డు నిర్మాణం త్వరలో జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# ప్రపంచ అందాల పోటీలను నిలిపివేయాలి

**- అరెస్టు చేసిన పివైఎల్ పిఓడబ్ల్యూ, పిడిఎస్యు, ప్రజా సంఘాల నాయకత్వాన్ని విడుదల చేయాలి**



**కోదాడ టౌన్, మే 12 ( ప్రజా జ్యోతి):** ప్రపంచ అందాల పోటీలను హైదరాబాదులో నిర్వహిస్తున్నారని వీటిని తక్షణమే నిలిపివేయాలని ఆందోళన నిర్వహిస్తున్న పి వై ఎల్, పి ఓ డబ్ల్యు నాయకత్వాన్ని పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు నల్గొండ నాగయ్య పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరవత్ రవి అన్నారు. స్థానిక కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో ధరవత్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్ లో ఉన్నదని, ఎవరు అప్పులు ఇవ్వడం లేదని, అప్పు పుట్టడం లేదని ఒకపక్క సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేసుకుంటూనే మరొక వైపు లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ ప్రపంచ అందాల పోటీలను నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా, విద్యార్థి, యువజన, కార్మిక, రైతుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తూ దుబారా ఖర్చులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్య%శీ% వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని వారన్నారు. పోలీసులు ప్రజా సంఘాల నాయకత్వాల పట్ల రాష్ట్రంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పకుండా నిరాకరించే నిర్బంధ పరిస్థితి రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అరెస్టు చేసిన పి వై ఎల్ , పి ఓ డబ్ల్యూ, పిడిఎస్యు, ప్రజా సంఘాల నాయకత్వాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు దేశంలో యుద్ధ వాతావరణం నెలకొని ఉంటే నేడు రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించి దేశానికి ఏం సంకేతం ఇవ్వాలని చూస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే అందాల పోటీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

# లారీ ఢీకొని వృద్ధుడు మృతి



**మిర్యాలగూడ, మే 12,( ప్రజాజ్యోతి ):** మిర్యాలగూడ మండలం తుంగపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని వృద్ధుడు నాగెల్లి రాములు(80) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. త్రిపురారం మండలం కంపాలపల్లికి చెందిన మృతుడు రాములు చెన్నై పాలెం లో ఉన్న తన మనవరాలి ఇంటికి వెళ్లేందుకు తుంగపాడులో ఆటో దిగి రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుండి హాలియా వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయాల పాలయ్యాడు. సమీప ప్రజలు 108 కు సమాచారం అందజేయడంతో హుటాహుటిన మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు నాగేల్లి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించేంతవరకు మిశ్రమించని గొప్ప నాయకురాలు.. పశ్య కన్నమ్మ

**-కన్నమ్మ ఆశయాలు,పోరాటం సిపిఐ పార్టీ ఏనాటికి మర్చిపోదు**

**-కన్నమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించిన జాతీయ కార్యదర్శి నారాయణ,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి**






**హుజూర్ నగర్ మే 12 (ప్రజా జ్యోతి)** ప్రజా సమస్యలు పరిష్కరించేంతవరకు క్షేత్రస్థాయి నుంచి వెనకడుగు వేయకుండా ఉద్యమించిన కమ్యూనిస్టు నాయకురాలు పశ్య కన్నమ్మ అని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ,కొత్తగూడెం ఎమ్మెల్యే రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి లు అన్నారు. సోమవారం స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ సాయిధ రైతాంగ వీరనారి పశ్యకన్నమ్మ సంతాప సభలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరినైనా లెక్క చేయని మనస్తత్వం, నిర్బంధాలకు భయపడని వ్యక్తిత్వం, పోరాట కుటుంబ నేపథ్యం కన్నమ్మ సొంతమన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం, మహిళల హక్కుల సాధన కోసం, వారి ఆర్థిక స్వావలంబన కోసం కృషిచేసిన ధీరవనిత కన్నమ్మ అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుది వరకు కమ్యూనిస్టుగా జీవించి సమ సమాజ స్థాపనలో అమరులయ్యారన్నారు. ఆమె ఆశయాలు, పోరాటం ఏనాటికి సిపిఐ మర్చిపోదన్నారు. ఆమె చేసిన అనేక సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలోసిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, అక్కినేని వనజ, భావం హేమంత రావు, జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి రజని, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, రైతాంగ పోరాట నాయకుడు దొడ్డ నారాయణరావు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రంగారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, గంగాభవాని, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, ప్రేమ్ పావని, అమీనా, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరగకుండా హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్పీడ్ బ్రేకర్ లు ఏర్పాటు పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్



**భువనగిరి,మే 12 (ప్రజాజ్యోతి)**భువనగిరి పట్టణ 10వ వార్డు హౌసింగ్,బోర్డ్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వల్ల గతంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లు పోయినందున,గత వారంలో అనుకోకుండా అతివేగంతో ఒక చిన్నారి ప్రాణం బలి కావడం దురదృష్టకరం ఇట్టి సందర్భం గా వార్డు,ప్రజలందరీ విజ్ఞప్తి మేరకు ప్రమాదాల నివారణకై హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత భువనగిరి మున్సిపల్ కమిషనర్,దృష్టికి పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ తీసుకువెళ్లగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ రామలింగం,హౌసింగ్ బోర్డు కాలనీ లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసిన వాటిని తాజా మాజీ కౌన్సిలర్ పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ కాలనీ సీనియర్ సిటిజెన్లతో కలిసి పరిశీలించడం జరిగింది ఈసందర్భంగా ప్రమోద్ కుమార్,మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీలో ముఖ్యంగా చిన్న పిల్లల తల్లిదండ్రులు ఎండాకాలం దుష్ట పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో రోడ్లపైకి పిల్లలను వెళ్ళనివ్వకుండా సాయంత్రం వేళలో వార్డులోని ఉన్న పార్కులలో,ఓపెన్ జిమ్ గ్రౌండ్,చిల్డ్రన్,పార్కులో పిల్లలను ఆడించాలని వార్డు ప్రజలను కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో కవిత,చంద్రశేఖర్ జిట్టా యాదిరెడ్డి భూపాల్ రెడ్డి అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సమ్మె విరమణ




**భువనగిరి,మే 12 (ప్రజాజ్యోతి)** తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మరియు,పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీఎం ఏ )గత 40 రోజులుగా,చేపట్టిన పరీక్షల బహిష్కరణ సమ్మెను విరమించారు.ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి డిగ్రీ కళాశాలల యాజ మాన్యాల,సమస్యలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లి,వెంటనే పరిష్కరిం చవలసిందిగా కోరగా. ముఖ్యమంత్రి సుముఖంగా స్పందించి,డిగ్రీ కళాశాలల,ఫీజు రీయింబర్స్ మెంట్,నిధులను వెంటనే విడుదల చేస్తామని గట్టి హామీ ఇవ్వడంతో.ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి అన్ని యూనివర్సిటీల,రాష్ట్ర కమిటీలతో మాట్లాడి స్వయంగా చైర్మన్ గా తానే బాధ్యత తీసుకుని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్లు,డిగ్రీ పీజీ కళాశాల ల యాజమాన్యం రాష్ట్ర అధ్యక్షులు డా,బొజ్జ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.అలాగే మే 14నుండి యధావిదిగ పరీక్షలు జరుగుతాయని మీడియా కు తెలిపారు.

## అమరులైన వీరజవాన్లకు.. కలం కార్మికుల ఘన నివాళులు..!



**మిర్యాలగూడ, మే 12,( ప్రజాజ్యోతి ):** భారత్ – పాక్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లు మురళి నాయక్ తోపాటు మిగిలిన సైనికులకు మిర్యాలగూడ జర్నలిస్టుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద కోవొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు ఖాజా హమీదొద్దీన్ మాట్లాడుతూ భారత్ – ఉగ్రవాద పాక్ యుద్ధంలో తమ ప్రాణాలను లెక్కచేయ కుండా వీరోచితంగా పోరాడి, వారి తూటాలకు బలైన తెలుగు రాష్ట్రానికి చెందిన మురళి నాయక్, ఇతర జవానుల పోరాట పటిమ స్ఫూర్తిదాయ కమని కొనియాడారు. దేశానికి సేవలో వారి అంకితభావం,త్యాగం మరువలేనిదన్నారు. అమర జవాన్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి పోరాటం వృదాకాదని, చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మహమ్మద్ అస్లాం, అయుబ్,వాడపల్లి రమేష్,నాజిమ్, మహేష్, నరేందర్ రెడ్డి, మట్టయ్య మందా సైదులు, జయరాజు, శ్రీను, జంగా లక్ష్మణ్, బాలాజీ,కట్టా బాబు, హరీష్, భాస్కర్, నాగచారి, రమేష్, మందా లక్ష్మణ్, వెంకట్, శివ యాదవ్, నాగభూషణం, సుదర్శన్, నరసింహ,భరత్, రాయించి నాగేష్, ఇటికాల శివ, ఉమర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృ దినోత్సవం

**చిలుకూరులో తల్లికి సన్మానం చేస్తున్న కుమారులు, కుమార్తెలు, బంధువులు**



**చిలుకూరు మే 12 (ప్రజా జ్యోతి):** చిలుకూరు గ్రామంకు చెందిన కొండా సరోజనమ్మను సోమవారం మాతృ దినోత్సవం సందర్భంగా ఆమె కుమారుడు, కుమార్తెలు, బంధువులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తల్లికి మాతృ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు చెరువు మట్టి డంపింగ్ .. నేడు ఇటుక బట్టీలకు షిఫ్టింగ్

**వేలల్లో మట్టి ట్రిప్పులు - లక్షల్లో నోట్ల కట్టలు**

**భారీ వాహనాలతో రాత్రి పగలు మట్టి తరలింపు**

**మండల కేంద్రం నుండి పోతున్నా పట్టించుకోని అధికారులు**






**పాలక వీడు, మే12(ప్రజా జ్యోతి):** సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం పరిధిలోని జాన పహాడ్ గ్రామ ఊర చెరువులో గత సంవత్సరం నీళ్లు లేక ఎండిపోయి ఉన్న చెరువులు మట్టి మీద అక్రమార్కుల ద్రుష్టి పడింది ఇదే అదునుగా చూసి, భారీ వాహనాలతో, జె సి బి లతో ఆ మట్టి ని ఇటుక బట్టీలకు అమ్ముకొని సొమ్ము చేసుకొన్నారు. ధనర్జనే ధ్యేయంగా అక్రమార్కులు చెరువు మట్టిని రోడ్డు ప్రక్కన పడావు భూములలో వేల ట్రిప్పులు డంపు చేసి ఉంచి, మే 6, 2025నుండి వేల ట్రిప్పులు మట్టి ఇటుక బట్టి లకు తరలించి లక్షల్లో సంపాదిస్తున్నారు. భారీ వాహనాలతో మట్టిని ఇటుకల బట్టీలకు, పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. పాలక వీడు మండల కేంద్రం నుండి రాత్రి పగలు అని తేడాలేకుండా మీటిమీరిన వేగంతో వెళుతున్నా అధికారులు పట్టించు కోకపోవటం పై పలు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. మండలనలోని అధికార పార్టీ నాయకుడి పాత్ర ఉన్నదని పలువురు మండల ప్రజలు గుస గుస లాడుతున్నారు.

**ప్రభుత్వ అదాయానికి గండి :**

ఒక చోట నుండి మరో ప్రాంతానికి భారీ వాహనాలతో మట్టి తరలించాలి అంటే మైనింగ్ శాఖ పరిమీషన్ తప్పక తీసుకోవాలి దానివలన ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది, అలా కాకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ సంపాదనకు పాల్పడుతూ ప్రభుత్వ అదాయానికి గండి కొడుతున్నారు.

**తాశీల్దార్ కమలాకర్ వివరణ :**

మట్టి తొలకం జరుగుతున్నట్లుమా దృష్టికి రాలేదు,మీరు మా దృష్టికి తీసుకొచ్చారు, మేము తెలుసుకొని వారి పై తగు చర్యలు తీసుకొంటాము.

# తుర్క కాశ కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

**-తుర్క కాశ కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ కే బడేసాబ్**

**- బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ కు వినతి**



**సంస్థాన్ నారాయణపురం, మే 12, (ప్రజాజ్యోతి) :** దుర్భర జీవితం అనుభవిస్తున్న తర్క, కాశ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని రాష్ట్ర తుర్కకాశ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్ కే బడే సాబ్ బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ ను కోరారు. సోమవారం ఆయన హైదరాబాదులో ఈటెల రాజేందర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. శాలువాతో సత్కరించారు. ఇటీవల ఓ టీవీ ఛానల్ డిబేట్లో ఈటల రాజేందర్ తర్క కాష కార్మికులు అత్యంత దుర్భర జీవితం అనుభవిస్తున్నారని ప్రస్తావించారని తెలిపారు. మా సమస్యలను అవగాహన చేసుకుని భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే సంక్షేమ పథకాలలో, జనగణన సమస్యలలో మా కార్మికులకు న్యాయం జరిగే విధంగా చేయాలని కోరారు. తుర్క, కాశలు గుట్టలలో జీవిస్తూ బండలు, కంకర తయారు చేస్తూ అత్యంత దయనీయ స్థితిలో జీవితం గడుపుతున్నారని తెలిపారు. తమ సమస్యలను అర్థం చేసుకొని టీవీ డిబేట్లో మాట్లాడినందుకు ఈటల రాజేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పార్లమెంటు సమావేశాలలో తమ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ కైసర్ తదితరులు పాల్గొన్నారు.

# సిరులనిచ్చే తల్లికి.. సిరి మాను శోభ...!

**- దామరచర్లలో ఘనంగా ముత్యాలమ్మ తల్లి జాతర**

**- పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్,ఎమ్మెల్సీ కె ఎస్ ఎన్**

**దామరచర్ల, మే 12,( ప్రజాజ్యోతి ):** కోరిన కోరికలు తీర్చే తల్లిగా... సిరులని ఇచ్చే కల్పవల్లిగా పూజలు అందుకుంటున్న దామరచర్ల మండల కేంద్రంలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతర సోమవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ప్రతి ఏటా అనవైతిగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వారం రోజులపాటు సాంప్రదాయంగా నిర్వహిస్తారు. సోమవారం అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి రాతిరథం పై సిరిమాను ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రధాన విధులలో ఊరేగింపు జరిపారు. ఈ వేడుకను చూసి ఎందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కోలాటాలు, డీజే పాటలు సాంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు సందడిగా మారింది. తమ ఇళ్ళ ముందుకు వచ్చిన సిరిమానుకు మహిళలు జలాభిషేకం జరిపారు. పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బి ఎల్ ఆర్ ), ఎమ్మెల్సీ కేతవత్ శం కర్ నాయక్ లు ముఖ్య అతిథులుగా పా ల్గొన్నారు. అవ మ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహి ంచ ారు. భక్తులతో కలిసి సరదాగా స్టెప్పులేసి ఉత్సా హపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



# ప్రపంచ దేశాల్లో ఉన్న టెర్రరిస్టులను మట్టు పెట్టాలి

**-కన్నె కంటి కన్నీరు వృధా పోదు**

**-మతాన్ని హింసకు వాడుకోవడం అటవీక సాంప్రదాయం**

**-ఉగ్రవాదానికి శాశ్వత పరిష్కారం చూపాలి**

**-సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**హుజూర్ నగర్ మే 12 (ప్రజా జ్యోతి)** ప్రపంచ దేశాల్లో ఉన్న టెర్రరిస్టులను మట్టి పెట్టాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం హుజూర్ నగర్ లో సిపిఐ సీనియర్ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ సాయుధ రైతాంగ వీరనారి పశ్య కన్నమ్మ సంతాప సభలో మాట్లాడుతూ కాశ్మీర్ లో అమాయకులను చంపి అందులో కొత్తగా పెళ్లయిన జంటలోని నేవీ ఆఫీసర్ ను చంపడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. చరిత్రలో కన్నె కంటి కన్నీరు ఎక్కడ వృధాగా పోలేదని ఇప్పుడు కూడా ఉగ్రవాదాన్ని లేకుండా చేసేందుకు ఆ కన్నీరు కారణమవుతుందన్నారు. టెర్రరిస్టులు ఇప్పటివరకు ఎప్పుడైనా ఆకస్మికంగా కాల్పులు జరపడం వెళ్లిపోవడమే చూశామని మొదటిసారి మత ప్రాతిపదికన చంపడం జరిగిందన్నారు. దేశంలో జరుగుతున్న టెర్రరిస్ట్ దాడులపై ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. దేశంలో ఎన్నికలు జరిగినప్పుడే టెర్రరిస్టులు దాడులు జరపడం అమాయకులు బలి కావడం దానిని బిజెపి పార్టీ వాడుకోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. అమెరికా ఒకవైపు పాకిస్తాన్తో ఆర్థిక సంబంధాలు కొనసాగిస్తూనే టెర్రరిస్ట్ యాక్టివిటీస్ ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించడం జరుగుతుందన్నారు. టెర్రరిస్టులను అంతం వందించడం ప్రపంచ దేశాలన్నీ కలసి శాశ్వత పరిష్కారం వెతకాలి అన్నారు. పాకిస్తాన్లో ఉన్న ముస్లింలందరూ టెర్రరిస్టులు కాదని అక్కడ కూడా టెర్రరిజాన్ని వ్యతిరేకించే సామాన్యమైన ప్రజలు ఉన్నారని గుర్తుపెట్టుకోవాలి అన్నారు. పాకిస్తాన్ లోని టెర్రరిస్టులను అంతం అందించాలి కానీ సామాన్య ప్రజల్ని కాదన్నారు. తీవ్రవాద సమస్యకు కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేయడం బిజెపి ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుంది అని విమర్శించారు. మతాన్ని, టెర్రరిజాన్ని ఎన్నికల లబ్ధి కోసం ఉపయోగించుకోవడం అటవీక సాంప్రదాయమని, అది కొంతమంది నాయకుల శాడిస్ట్ మెంటాలిటీని తెలియజేస్తుందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఆర్ఎస్ఎస్ రెండు ఒకే సంవత్సరం ఆవిర్భవించిన దేశం కోసం పోరాడిన చరిత్ర నిజమైన దేశభక్తి కమ్యూనిస్టులదే అన్నారు. దేశ రక్షణ, ప్రజా ప్రయోజనాల రక్షణకు సిపిఐ పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు.

**నిజాన్ని నిక్కచ్చిగా ధైర్యం చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉంది**
**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



నిజాన్ని నిక్కచ్చిగా ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు అన్నారు. అసలైన కమ్యూనిస్టులు తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా చెప్తారన్నారు. కమ్యూనిస్టులు భావజాలం ప్రకారం ఎక్కడ వెనుకబడి లేరని నిర్ణయక పాత్రలో ఉన్న విషయం అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులు మద్దతు ఉన్న పక్షమే అధికారం చేజిక్కించుకోవడం దీనికి నిదర్శనం అన్నారు. ఎన్నికలలో డబ్బులు ఖర్చు పెట్టడంలో కమ్యూనిస్టులు వెనుకబడి ఉన్న మాట వాస్తవమేనని డబ్బులే ఖర్చు పెడితే కమ్యూనిస్టులే గెలుస్తారన్నారు. దేశంలో ప్రజల ఎమోషన్స్ ను రాజకీయాలకు వాడుతున్నారన్నారు. మనిషికి ఆకలి ఉన్నంతకాలం ఉద్యమాలు ఉంటాయని ఉద్యమాలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారన్నారు. ప్రజల పట్ల సమాజం పట్ల అంకిత భావం ఎర్రజెండాకే సాధ్యమన్నారు.

**ప్రజలు ఏం కోరుకుంటున్నారో కమ్యూనిస్టులు గ్రహించాలి**
**– రాష్ట్ర ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి**

ప్రజలు ఏం కోరుకుంటున్నారో ప్రజల ప్రయోజనాలకు ఏమి కావాలో దేశ ప్రయోజనాలకు ఏం కావాలో కమ్యూనిస్టులు గ్రహించి వివరించడంలో వెనకబడవద్దని రాష్ట్ర ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏ పార్టీలో ఉన్న నాయకులకైనా భావజాలాన్ని అందించింది కమ్యూనిస్టులేనన్న విషయం మరవరాదన్నారు. కమ్యూనిస్టులు ప్రమాదకర పరిస్థితులను ప్రజలకు చెప్పడంలో ముందుండాలి అన్నారు. ప్రపంచ చరిత్రలో అమెరికా ఏ యుద్ధంలో ఇప్పటివరకు గెలవలేదని కేవలం వ్యాపారం కోసమే యుద్ధాలు చేస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడింది కమ్యూనిస్టులేనని ఈ పోరాటం చేయని ఆర్ఎస్ఎస్ దేశభక్తి అంటే తామేనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, అక్కినేని వనజ, భావం హేమంత రావు, జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి రజని, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, రైతాంగ పోరాట నాయకుడు దొడ్డ నారాయణరావు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రంగారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, గంగాభవాని, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు ప్రేమ్ పావని, అమీనా, సదాలక్ష్మి, జ్యోతితదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కొరకు స్థలాన్ని కేటాయించాలి

**- వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మే 12(ప్రజాజ్యోతి):**సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కొరకు స్థలాన్ని కేటాయించాలని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు స్థలం కేటాయించాలని అన్ని జిల్లాలో కలెక్టర్ లకు మెమోరాండం అందజేయాలని వారు ఆదేశించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 26న జరిగిన రాష్ట్ర క్యాబినెట్లో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు జిల్లా హెడ్ క్వార్టర్స్ వద్ద ఎకరం భూమిని కేటాయించి అటువంటి కార్యాలయాలకు ఆస్థి పన్ను మినహాయింపు నిర్ణయించిందని తెలిపారు. భూమికి చెల్లింపు వంటి అన్ని అధికారిక ఫార్మాలిటీలను నెరవేర్చడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దానిలో భాగంగానే సూర్యాపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా దరఖాస్తు చేశామని కానీ బిఆర్ఎస్ పార్టీకి మాత్రమే స్థలం కేటాయించిందని మిగతా రాజకీయ పార్టీలకు కేటాయించలేదని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో అన్ని జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని ఆశ భావ వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఎమ్మార్వో కు ఫోన్ ద్వారా తెలియజేసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కోసం స్థలం పరిశీలించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చివర్ల మండలం ఎమ్మార్వో పులుసు యాదగిరి, రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, మార్కెట్ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, చింతమల్ల రమేష్, ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, రుద్రంగి రవి, నాగుల వాసు, అబ్దుల్ రహీం, సిరివెళ్ల శబరినాథ్, అన్నమయ్య రాము, సాయి నేత తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యల పరిష్కారంకై "జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి"

**- ఎన్. పి. ఆర్. డి. జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్**

**ముట్టడి కరపత్రాలు ఆవిష్కరణ**

**భూదాన్ పోచంపల్లి, మే 12 (ప్రజాజ్యోతి)** వికలాంగుల సమస్యల పరిష్కారంకై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ఎన్. పి. ఆర్. డి. జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ పిలుపునిచ్చారు. భూదాన్ పోచపల్లి మండల కేంద్రంలోని నేతాజీ చౌరస్తాలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్పి ఆర్డి పోచంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో జరగబోయే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ముట్టడి విజయవంతం చేయాలని కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్. పి. ఆర్. డి. జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగులందరికీ అంథోదయ్యా రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. అదేవిధంగా 2010 నుండి పెన్షన్ పొందుతున్న ప్రతి వికలాంగులకి యూడి ఐడి కార్డు పంపిణీ చేయాలని స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసిన వారికి వెంటనే ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని అన్నారు. వికలాంగులకు జిల్లా మండల కేంద్రాల్లో ఉన్న ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ లో ఐదు



శాతం వికలాంగులకు కేటాయించాలి అదేవిధంగా జిల్లా కేంద్రంలో వికలాంగుల కోసం ప్రత్యేకంగా వేలగజాల స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో వికలాంగులతో ప్రత్యేకంగా శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు జారీ చేసి 150 రోజులు పని కల్పించాలి. రోజుకు 600 ఇవ్వాలని కూడా డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి డివిజన్ అధ్యక్షులు ఏర్పుల శివయ్య పోచంపల్లి మండల అధ్యక్షులు ముదిగొండ రాములు టౌన్ నాయకులు మంచాల మధు దుబ్బాక జగన్ బిక్షపతి శేఖర్ పద్మారెడ్డి కృష్ణారెడ్డి వెంకటేశం పాల్గొన్నారు.

## అమరులైన వీరజవాన్లకు.. శాఖాపురంలో ఘన నివాళులు..!

**నిడమానూరు, మే 12,( ప్రజాజ్యోతి):**భారత్ – పాక్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లు మురళి నాయక్ తోపాటు మిగిలిన సైనికులకు శాఖాపురం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మోసాల శ్రీను ఆధ్వర్యంలో సోమవారం అమరవీరుల కోసం కోవొత్తులతో నివాళులతో ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా శాఖాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మోసాల శ్రీను మాట్లాడుతు భారత్ – ఉగ్రవాద పాక్ యుద్ధంలో తమ ప్రాణాలను లెక్కచేయ కుండా వీరోచితంగా పోరాడి, వారి తూటాలకు బలైన తెలుగు రాష్ట్రానికి చెందిన మురళి నాయక్, ఇతర జవానుల పోరాట పటిమ స్ఫూర్తిదాయ కమని కొనియాడారు. దేశానికి సేవలో వారి అంకితభావం, త్యాగం మరువలేనిదన్నారు. అమర



జవాన్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి పోరాటం వృదాకాదని, చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖాపురం గ్రామ స్థాయి, మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# మొబైల్ ఐ సి టి సి సేవలకి విశేష స్పందన - అపర్ణ కుమారి

**ఐ సి టి సి ద్వారా హెచ్.ఐ.వి పరీక్షలు**



**చిట్యాల మే 12 (ప్రజా జ్యోతి)** మొబైల్ ఐసిటిసి ద్వారా నిర్వహించే హెచ్ఐవి ఎయిడ్స్ పరీక్షలకు విశేష స్పందన వస్తుందని కౌన్సిలింగ్ అధికారి అపర్ణకుమారి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో నల్లగొండ డిప్యూటీ డిఎంహెచ్ వో వేణుగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో, డిపి ఎం ఓ సుధాకర్ సారధ్యంలో జిల్లా వ్యాప్తంగా మొబైల్ ఐ సి టి సి ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ టెస్టులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చిట్యాల పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మొబైల్ వాహనంలో టెస్టులు నిర్వహించారు. కౌన్సిలర్ అపర్ణకుమారి మాట్లాడుతూ మొబైల్ ఐ సి టి సి సేవలకు విశేష స్పందన లభిస్తుందని హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు అధైర్య పడకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకొని మందులు వాడాలని తెలిపారు. ప్రజలు హాస్పిటల్ కి వెళ్లకుండా వారి వద్దకే పరీక్షలు టెస్టులు చేసే విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని టెస్టులు చేయించుకుని నిర్ధారణ అయినవారికి మందులు అందించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్. టి తిరుమలా చారి, ఎల్. డబ్ల్యూ ఎస్ వర్కర్ ప్రియాంక పాల్గొన్నారు.

## అబద్ధపు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్న టిఆర్ఎస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి.




**మునగాల మే 12 (ప్రజా జ్యోతి):-**పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలను పక్కకు పెట్టి ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని కానీ నేటి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను గుండెల్లో పెట్టుకొని పార్టీలకు అతీతంగా విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు గా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి కోదాడ శాసన సభ్యురాలు ఉత్తం పద్మావతి రెడ్డిలు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడంలో ముందున్నారని ఆయన అన్నారు.

## అంగరంగ వైభవంగా వేణుగోపాలస్వామి కళ్యాణ మహెూత్సవం



**గుండాల, మే 12(ప్రజా జ్యోతి)** సుద్దాల గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి, సత్యభామ సమేతంగా వేణుగోపాలస్వామి కళ్యాణ మహెూత్సవం సోమవారం సుద్దాల గ్రామంలోఅంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు భాజ ,భజంత్రీలతో వేదమంత్రాల నడుమ కళ్యాణం కనుల పండుగ నిర్వహించారు. కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యల్లో తరలివంచి వచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కళ్యాణానికి ప్రభుత్వ విప్ ఆలేరుఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమంలోపాల్గొన్నారు. అనంతరం శివరాత్రి యాదగిరి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలోవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డిమరియు కమిటీ సభ్యులు, విగ్రహ దాత మరియు అన్నదాత శివరాత్రి యాదగిరి, జంపాల సోమన్న గడ్డమీది పాండరీ గౌడ్, దొంతూరి మల్లయ్య,కాంగ్రెస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు నాయిని కృష్ణారెడ్డి, గ్రామ ప్రజలు భక్తులుతదితం ాలుపాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక




**మునగాల మే 12 (ప్రజా జ్యోతి):-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ ాపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆక ార్షితులై జగన్నాధ పురం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ సీపీఎం పార్టీల కు చెందిన ఎస్కే రంజాన్ కోడి సింహాద్రి వెంపటి ఉపేందర్ వెంపటి రాములు వెం పటి ఎల్లయ్యలు మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంపార్టీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జయపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ప్రతిపక్షాలు నోటికి వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు సీనియర్ నాయకులు నల్లమాద మల్సూర్ మునగాల గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్ము ఈదారావు ఎల్లావుల మల్లయ్య యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తక్కెలపాటి సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎరుకల నాంచారమ్మ దివ్య ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### - ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

### ఘనంగా ఎరుకల నాంచారమ్మ కళ్యాణం







**భూదాన్ పోచంపల్లి, మే 12 (ప్రజాజ్యోతి)** ఎరుకల నాంచారమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలంలోని పిలయపల్లి గ్రామంలో ఎరుకల నాంచారమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్సీ కుంభ రవిబాబు తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యహాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే జాతరలో కోలాటాలు బోనాలు డప్పుల వాయిద్యాలు మధ్య అంగరంగ వైభవంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జ్ ఎమ్మార్వో నాగేశ్వరరావు ఎస్సై భాస్కర్ రెడ్డి జాతర నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎరుకల సంఘం అధ్యక్షులు కుతాడికుమార్, కూతాడి రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ జిల్లా ఉపాధ్యక్షులు కూతాటి భాస్కర్ డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి సామ మధుసూధన్ రెడ్డి తడక వెంకటేష్ మాజీ సర్పంచ్ అందేలా హరీష్ యాదవ్ మాజీ ఎంపీటీసీ బందారపు సుమలత లక్ష్మణ్ గౌడ్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూషణం గౌడ్ గౌడ సంఘం అధ్యక్షులు సదానందం గౌడ్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్ నాయకుల తోట బాబు కూతాడి మహేష్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలి

### -రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామ ప్రొఫైల్ తయారు చేయాలి

### - కార్యాలయాలలో కోర్టు కేసుల డిస్పోజల్ కొరకు ప్రత్యేక సిబ్బంది

### - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**సూర్యాపేట కలెక్టరేట్,మే 12(ప్రజాజ్యోతి):**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టం క్రింద రైతులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపిన మీదట క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ పి.రాంబాబుతో కలిసి కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.భూభారతి దరఖాస్తుల పరిశీలన,విచారణ అంశాలపై మార్గ నిర్దేశం చేశారు.ముందుగా డస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులు వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలి,అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనల కనుగుణంగా విచారణ జరపాలన్నారు.విచారణ జరిపేందుకు వెళ్లే ముందుగా దరఖాస్తుదారునికి నోటీసు అందజేయాలని తెలిపారు.ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేయాలని తెలిపారు.హుజూర్నగర్,కోదాడ డివిజన్లో 98% దాన్యం కొనుగోలు పూర్తి అయ్యాయని,తుంగతుర్తి,సూర్యాపేట డివిజన్ లోని సెంటర్లో ఇంకా కొనుగోలు జరుగుతున్నాయని తెలిపారు.రెవెన్యూ సిబ్బంది ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని,ఎండలు బాగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ వారం రోజులలో ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మీసేవ లో పెండింగ్ సర్టిఫికెట్స్ లను పరిశీలించి త్వరగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కోర్టు కేసులు త్వరగా పరిష్కరించబడాలని దీనికోసం కార్యాలయంలో ఒక ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ తాసిల్దార్లకు ఆదేశించారు.జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో గ్రామాల వారిగా గ్రామ ప్రొఫైల్ తయారు చేయాలని తాసిల్దార్లకు కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో భూభారతి కార్యక్రమంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద చేపట్టిన గరిడేపల్లి లో జరిగిన రెవెన్యూ సదస్సులలో మొత్తం 1690 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.ముందుగా సిబ్బంది భూభారతిలో దరఖాస్తు చేసిన వారికి నోటీసులు పంపాలని దానిలో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చే తేదీలను కూడా చేర్చాలని కలెక్టర్ పేర్కొన్నారు.సమస్యాత్మక గ్రామాలలో భూ పరిశీలనకు వెళ్ళినప్పుడు పోలీసు బందోబస్తుతో దరఖాస్తుల పరిశీలనకు వెళ్లాలని తెలిపారు.అధికారులు దరఖాస్తులను పూర్తి పరిశీలించిన పిమ్మట అన్ని డాక్యుమెంట్లతో పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు.రాష్ట్ర ప్రజావాణి,జిల్లా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సూర్యపేట ఆర్డిఓ వేణుమాధవరావు,కోదాడ సూర్యనారాయణ,హుజూర్నగర్ శ్రీనివాసులు,అన్ని మండలాలకు చెందిన తాసిల్దారులు,ఆర్ఐ,డీటీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా పోలీసుల అధ్వర్యంలో పిల్లలకు వేసవి ఉచిత శిక్షణ శిబిరం

- భావిభారత పౌరులు దృఢంగా ఉండాలి
- తల్లిదండ్రులు,గురువులు చెప్పేది బుద్ధిగా నేర్చుకోవాలి
- బాధ్యతగల పౌరులుగా,అందరికీ మంచి పేరు తెస్తూ-ఉన్నత స్థాయికి ఎదగాలని
ఆటలు మేధస్సును పెంచుతాయి
సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహా





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మే 12(ప్రజాజ్యోతి)**:వేసవి సెలవుల సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో గల జిల్లా పరిషత్ పాఠశాల నందు పిల్లలకు వేసవి ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు మరియు జిల్లా బాల భవన్ ఆధ్వర్యంలో ఎస్పీ నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు పిల్లల కోసం మరియు కాలనీ పిల్లల కోసం ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించామని దీనిలో పిల్లలకు మేధస్సు,జ్ఞాపకశక్తి,ప్రయోగాత్మక విధానం పెంపొందించే విధంగా ప్రయోగాత్మక ఇంటలిజెన్స్,యోగ,క్రాఫ్ట్,మ్యూజిక్,కర్ర సాము,సాంప్రదాయ నృత్యం,సంగీత పరికరాలు,ఇండోర్ ఆటలు మొదలగు అంశాల గురించి శిక్షణ ఇవ్వడం జరుగుత ుంది. పాఠశాల పిల్లలు ఎవరైనా ఈ శిక్షణను సద్వికినియోగం చేసుకోవచ్చని అన్నారు . పిల్లలు భావిభారత పౌరులు,బావి భారత పౌరులు దృఢంగా ఉండాలి,తల్లిదండ్రులు గురువులు చెప్పేది బుద్ధిగా నేర్చుకోవాలి,మేధస్సును, జ్ఞాపకశక్తిని పెంచే ఆటలపై దృష్టి పెట్టి అలాంటి ఆటలు ఆడుకోవాలి,పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి,మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకోవాలి. గురువుల నేర్పే సద్విధ్యాను జ్ఞాపక శక్తితో కూడిన అలవాట్లను మంచిగా నేర్చుకుని కృషిచేసి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి అన్నారు. పోలీసులు సమాజ రక్షణకోసం ఉన్నారు, సైనికులు నిజమైన హీరోలు అన్నారు,మద్యం మత్తులో వాహనాలు నడిపిన,దొంగతనాలు,అసాంఘిక చర్యలు,విద్యాసంస్థల్లో వేదింపులు ఇలా ఏవైనా స్థానిక పోలీస్ లకు,డయల్ 100 కు తెలపాలి అని విద్యార్థులకు తెలిపినారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్నారు,ఆపరేషన్ సిందూర్ ను ముందుకు తీసుకెళ్ళి విజయవంతం చేసినది ఇద్దరు మహిళా అధికారులే. అంతరిక్షానికి వెళ్లి ప్రయోగాలు చేస్తున్నారు,పిల్లలు మంచి భవిష్యత్తులో స్థాయికి వెళ్ళాలని కోరుతున్నాను అన్నారు. తదనంతరం రిఫ్రెష్మెంట్ కోసం పిల్లలకు పండ్లు,బిస్కెట్ అందించారు. ఈ కార్యక్రమం నందు ఏ ఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి,సూర్యాపేట డివిజన్ డి.ఎస్.పి పార్థసారథి,జిల్లా బాల భవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణా రెడ్డి,భాల భవన్ సభ్యులు రిటైర్డ్ అధ్యాపకులు అమిద్ ఖాన్,యోగా గురువు,జిల్లా బాల భవన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు...!

## గడ్డం లక్ష్మీనారాయణ యాదవ్...



**మునగాల మే 12 (ప్రజా జ్యోతి):-** (మునగాల)సొంతిల్లు లేని నిరుపేదలకు ఇవ్వవల సిన ఇందిరమ్మ ఇండ్లను అధికార పార్టీ నాయకులు తమకు ఇష్టం వచ్చినట్లు ఇందిరమ్మ కమిటీల పేరుతో ఎలాంటి గ్రామసభలు నిర్వహించకుండా తీర్మా నాలు చేసుకొని ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కేటాయిస్తూ, నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని గడ్డం లక్ష్మీనారాయణ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలు గత రెండు సంవత్సరాలుగా ఇందిరమ్మ ఇండ్లకోసం ఎదురు చూస్తుండగా. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై ఏకప క్షంగా తమ పార్టీకి చెందిన కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయించుకుంటోందని ఆరోపించారు. గతంలో భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిన వారికి, వివిధ ప్రమాదాల్లో ఇల్లు కాలిపోయిన వారికి, గు డిసెల్లో నివాసం ఉంటుగూడు లేక నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతు న్నవారికి సైతం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకుండా అధికారం ఉన్నదని అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇంత జరుగుతు న్న అధికారుల సైతం నోరు మెదపకుండా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ అర్హులను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతంలో నిరుపేద కుటుంబాలకు చెందిన అర్హులైన వారినిఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులుగా ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# బుద్ధవనాన్ని సందర్శించిన 22 ఆసియా దేశాల సుందరీమణుల పోటీదారుల బృందం

- నాగార్జున సాగర్ తీరం అందాల అంచున ,బుద్ధవనం మహాస్థూపం వద్ద ఫోటోలు దిగిన సుందరీమణులు
- బుద్ధుని మహా పాదాలకు పూలతో పూజలు ,మహా స్థూపం లో జ్యోతి ప్రజ్వలన, ధ్యానంలో పాల్గొన్న సుందరీమణులు
- ప్రపంచ సుందరీమణుల పోటీదారులకు ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.ఎస్ పి శరత్ చంద్ర పవార్
- హాజరైన ఎం ఎల్ ఏ లు కుందూరు జయవీర్ రెడ్డి,బాలు నాయక్,బత్తుల లక్ష్మారెడ్డి,ఎం ఎల్ సి శంకర్ నాయక్,







**నిడమానూరు, మే 12 (ప్రజాజ్యోతి)**:తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది సుందరీమణుల బృందం సోమవారం నల్గొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది. ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్ లో ఫోటోలు దిగారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. అదేవిధంగా మహాస్థూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రాముఖ్యత,బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం జాతకవనంలో బుద్ధ చరితం పై కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్ పి శరత్ చంద్ర పవార్ ,ఎం ఎల్ ఏ లు కుందూరు జయవీర్ రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి,బాలునాయక్, ఎం ఎల్ సి శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం,నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను ,తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు. ఐ ఏ ఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్,ఏ ఎస్ పి లు రమేష్,మౌనిక,ఆర్ డి వోలు,జిల్లా అధికారులు, హాజరయ్యారు

# వైభవంగా శ్రీ బాల నర్సింహస్వామి కల్యాణోత్సవం.



**చిట్యాల మే 12(ప్రజా జ్యోతి):** చిట్యాల పట్టణ శివారులోని ప్రసిద్ధమైన శ్రీ బాలనర్సింహ్మా స్వామి కల్యాణోత్సవంను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ మంటపారాధన, హెూమంను అభిషేకంలను పురోహితుడు దౌలతాబాద్ వాసుదేవ్ శర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆనంతరం నిర్వహించిన గరుడ ముద్ద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆనంతరం అందంగా ముస్తాబు చేసిన ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ మంటపం పైకి తీసుకువచ్చి వేదమంత్రోచ్చరణలతో కల్యాణోత్సవంను నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రొఫెసర్ ముప్పా నర్సింహ్మారెడ్డి– భారతిలు ఏర్పాటు చేసిన పుస్తె, మట్టెలు, తలంబ్రాలను బొబ్బల శివశంకర్ రెడ్డి – శ్వేత దంపతులు ఆలయంలో అందజేశారు. ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు కళ్ళెం పవన కుమార్ రెడ్డి– స్వప్న దంపతులు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కల్యాణోత్సవ వేడుకలలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి, అలయ ఉత్సవ కమిటీ చైర్మన్ యిమ్మడి వెంకటేశ్వర్లు, నాయకులు మాజీ ఎంపీ చైర్మన్ కాటం వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ,పట్టణ పార్టీ అధ్యక్షులు జడల చిన మల్లయ్య, ఏర్పుల పరమేశ్,డైరెక్టర్లు నల్లా మహేందర్ రెడ్డి,బూడిద లింగస్వామి,బెల్దె నర్మద సత్యనారాయణ,అమనగంటి నరేష్,తదితరులు పాల్గొన్నారు.



# బుద్ధవనాన్ని సందర్శించిన 22 ఆసియా దేశాల
# సుందరీమణుల పోటీదారుల బృందం

నాగార్జున సాగర్ తీరం అందాల అంచున, బుద్ధవనం మహాస్థూపం వద్ద ఫోటోలు దిగిన సుందరీమణులు

బుద్ధుని మహా పాదాలకు పూలతో పూజలు, మహా స్థూపం లో జ్యోతి ప్రజ్వలన, ధ్యానంలో పాల్గొన్న సుందరీమణులు

ప్రపంచ సుందరీమణుల పోటీదారులకు ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్ పి శరత్ చంద్ర పవార్

హాజరైన ఎం ఎల్ ఏ లు కుందూరు జయవీర్ రెడ్డి, బాలు నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఎం ఎల్ సి శంకర్ నాయక్



నల్గొండ మే 12(ప్రజాజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది సుందరీమణుల బృందం సోమవారం నల్గొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది. ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్ లో ఫోటోలు దిగారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానం లో పాల్గొన్నారు. మహాస్థూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రాముఖ్యత,బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం జాతకవనంలో బుద్ధ చరితం పై కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్ పి శరత్ చంద్ర పవార్, ఎం ఎల్ ఏ లు కుందూరు జయవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, ఎం ఎల్ సి శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం, నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను, తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు. ఐ ఏ ఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఏ ఎస్ పి లు రమేష్, మౌనిక, ఆర్ డి వోలు,జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.















